సాక్షి
కుమురంభీం
శుక్రవారం। 22। నవంబర్। 2024



విధుల్లో క్రమశిక్షణ ముఖ్యం

ఆదిలాబాద్‌లో శిక్షణ పూర్తిచేసుకున్న 254 మంది నూతన కానిస్టేబుళ్లకు 'దీక్షాంత్ పరేడ్' నిర్వహించారు. పీఅండ్‌ఎల్ ఐజీ ఎం.రమేశ్ అతిథిగా హాజరయ్యారు. 8లో▸



అవగాహన ఏది? 9లో▸

పీఎంకేఎంవై ద్వారా 60 ఏళ్లు నిండి రైతులకు ప్రతినెలా రూ.3 వేల పింఛన్ అందుతోంది. అవగాహన లేకపోవడంతో అర్హులు సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు.

గరిష్టం/కనిష్టం
28.4 /14.5

వాతావరణం

ఆకాశం అప్పుడప్పుడు మేఘావృతమవుతుంది. రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. చలి పెరుగుతుంది. తెల్లవారుజామున పొగమంచు అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

విద్యార్థులు ప్రతిభ చూపాలి



గణితం బోధిస్తున్న శ్రీనివాస్

ఆసిఫాబాద్‌రూరల్: జాతీయ సాధన సర్వే-2024లో విద్యార్థులు ప్రతిభ చూపాలని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని గుండి ప్రభుత్వ పాఠశాలను గురువారం సందర్శించారు. విద్యార్థులతో బోర్డుపై లెక్కలు చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 4న జాతీయస్థాయి నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే నిర్వహిస్తారన్నారు. మూడు నుంచి ఆరు, తొమ్మితో తరగతి విద్యార్థులు అభ్యసన ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు బోధించాలన్నారు. వారంతపు పరీక్షలు, మాక్ టెస్టులు నిర్వహించాలని సూచించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



క్రీడాకారులతో అధికారులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో గురువారం ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో జోనల్‌స్థాయి నెట్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు. 200 మంది క్రీడాకారులు హాజరుకాగా ప్రతిభ చూపిన 12 మంది బాలురు, 12 మంది బాలికలు అండర్- 17 విభాగంలో రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని డీఎస్‌వో మీనారెడ్డి, ప్రిన్సిపాల్ మహేశ్వర్ తెలిపారు. వీరు ఈ నెల 23న మహబూబాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని అన్నారు. విద్యార్థులు క్రీడల్లో రాణించి జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీడీ, పీఈటీలు తిరుపతి, హరికృష్ణ, స్వరూప, శ్రీవాణి, ప్రభాకర్ పాల్గొన్నారు.

గ్రూప్- 2 నమూనా పరీక్షలకు దరఖాస్తులు

ఆసిఫాబాద్‌రూరల్: తెలంగాణ పబ్లిక్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించే రెండు గ్రూప్- 2 నమూనా పరీక్షలకు జిల్లాలోని ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, జైనులు, బౌద్ధులు, పార్సీ వర్గాలకు చెందిన యువతీ యువకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత గల వారు ఈ నెల 29లోగా జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో గల మైనార్టీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. డిసెంబర్ 2, 3, 9, 10 తేదీల్లో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు 85007 23745 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఆరుతడికే మొగ్గు

- యాసంగి సాగుకు వ్యవసాయశాఖ సన్నద్ధం
- జిల్లాలో 42,950 ఎకరాల్లో పంటలు
- నీటి సౌకర్యం లేక ఆరుతడి పంటల వైపు రైతుల చూపు
- అయినా గరిష్టంగా 21,455 ఎకరాల్లో వరి



యాసంగి సాగు వివరాలు

పంటరకం	ఎకరాలు
వరి	21,455
గోధుమ	1,044
జొన్న	10,202
మొక్కజొన్న	2,560
శనగ	6,516
కందులు	85
పెసర	530
మినుము	36
వేరుశనగ	171
నువ్వులు	95
సన్‌ఫ్లవర్	50
పొగాకు	25
కుసుములు	1
ఇతర పంటలు	180

ఆసిఫాబాద్: జిల్లాలో యాసంగి సాగుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. మండలాల వారీగా ప్రణాళికలు రూపొందించి రాష్ట్ర వ్యవసాయ శాఖకు నివేదించారు. ప్రస్తుతం జిల్లాలో వరికోతలు జోరుగా సాగుతుండగా మరో 15 రోజుల్లో పూర్తికానున్నాయి. అలాగే పత్తి ఏరివేత పనులు కూడా కొనసాగుతున్నాయి. వానాకాలం పంటల సీజన్ ముగుస్తుండగా.. అన్నదాతలు యాసంగి సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఈ ఏడాది యాసంగిలో జిల్లాలోని 15 మండలాల్లో 42,950 ఎకరాల్లో పలు రకాల పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. రాష్ట్ర ప్రభుత్వం వరి ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ ప్రకటించినా సాగు విస్తీర్ణం గతం కంటే పెరిగే అవకాశం లేదని భావిస్తున్నారు. వరి పంట ఎకరాకు 3 బస్తాల యూరియా, 90 కిలోల డీఏపీ, 30 కిలోల పొటాష్ అవసరం ఉంటుంది. ఈ క్రమంలో జిల్లాకు సుమారు 4,200 మెట్రిక్ టన్నుల యూరియా, 70 మెట్రిక్ టన్నుల డీఏపీ, 4100 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్, 140 మెట్రిక్ టన్నుల పొటాషియం, 90 మెట్రిక్ టన్నుల సూపర్ ఫాస్ఫేట్ అవసరం ఉంటుందని అంచనా వేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం వానాకాలం పంటల చివరి దశలో ఉండడంతో యాసంగి సాగు ఎరువులపై వ్యవసాయశాఖ అధికారులు పూర్తిస్థాయిలో అంచనాలు సిద్ధం చేయలేదు.

వరి, జొన్న అధికం..

వానాకాలం సీజన్‌లో మొత్తం 4.50 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేయగా.. అందులో పత్తి పంట అత్యధికంగా 3.50లక్షల ఎకరాల్లో సాగైంది. ఇక యాసంగి సీజన్‌లో 42,950 ఎకరాల్లో పంటలు సాగు చేయనున్నట్లు అంచనా వేస్తున్నారు. జిల్లాలో సాగునీటి వనరులు తక్కువగా ఉన్నా బోరు సౌకర్యం ఉన్న అనేక మంది వరి సాగుకే మొగ్గు చూపుతున్నారు. దీంతో వరిపంట 21,455 ఎకరాల్లో సాగయ్యే అవకాశం ఉంది. ఇక ఏజెన్సీలోని కెరమెరి, తిర్యాణి, సిర్పూర్(యూ), జైనూర్, లింగాపూర్ తదితర మండలాల్లో జొన్న సాగు ఎక్కువగా ఉంటుంది. వరి తర్వాత జొన్న 10,202, శనగ 6,516, మొక్కజొన్న 2,560 ఎకరాల్లో సాగు ఉంటుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. మరోవైపు జిల్లాలోని వట్టివాగు, కుమరంభీం తదితర ప్రాజెక్టుల్లో పుష్కలంగా నీరున్నా చివరి ఆయకట్టు వరకు అందని పరిస్థితి నెలకొంది. ఈ ఏడాది విస్తారంగా వర్షాలు కురిసిన నేపథ్యంలో ప్రాజెక్టులు, చెరువుల్లోకి భారీగా వరద చేరింది. కాలువల నిర్మాణం అసంపూర్తిగా ఉండటం, ప్రాజెక్టుల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ఆయకట్టు రైతులు కూడా ఆరుతడి పంటలకే పరిమితం కానున్నారు.

పెరిగిన ఎరువుల ధరలు

యాసంగి సీజన్ ప్రారంభానికి ముందే ఎరువుల కంపెనీలు మూడు రకాల ఎరువుల ధరలు పెంచి రైతులపై భారం మోపుతున్నాయి. అత్యధికంగా వినియోగించే కాంప్లెక్స్ ఎరువుల రేట్లు పెంచాయి. గతేడాదితో పోలిస్తే బస్తాకు రూ.100 వరకు పెరిగింది. గతేడాది బస్తా రూ.1200 ఉండగా, ఈ ఏడాది రూ.1300కు చేరింది. డీఏపీ ధర పెంచకపోవడంతో రైతులకు కాస్త ఉపశమనం కలిగింది. ప్రస్తుతం డీఏపీ ఎరువుల బస్తాకు రూ.1350 లభిస్తుంది. డిసెంబర్ నెలాఖరు వరకు డీఏపీ ధర సైతం పెరిగే అవకాశం ఉందని వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి. కౌలు భూమి ధరలు, ఎరువులు, కూలీల ధరలు ఏటా పెరుగుతుండడంతో రైతులకు సాగు భారంగా మారింది.

ప్రణాళిక సిద్ధం చేశాం

జిల్లాలో యాసంగి సాగు ప్రణాళిక సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించాం. ప్రస్తుతం జిల్లాలో వరి కోతలతో పాటు పత్తి ఏరివేత పనులు కొనసాగుతున్నాయి. మిగిలిన జిల్లాలతో పోలిస్తే ఇక్కడ యాసంగి సాగు కాస్త ఆలస్యంగా ప్రారంభమవుతుంది. జిల్లాకు అవసరమైన ఎరువుల వివరాలతో నివేదిక సిద్ధం చేయాల్సి ఉంది. రైతులు పంటల మార్పిడిని పాటించాలి.

– రావూరి శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయాధికారి

అడ్డగోలు దోపిడీ!

జైనూర్ మండల కేంద్రంలోని సయ్యద్ ముబారక్‌కు చెందిన మీ సేవ కేంద్రం అనుమతిని ఈ నెల 19న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే రద్దు చేశారు. దరఖాస్తుదారులకు రశీదు ఇవ్వకపోవడం, నిర్ణీత ధరల కంటే అధికంగా డబ్బులు వసూలు చేయడం, ధరల పట్టిక ప్రదర్శించకపోవడం, ఇతర నిబంధనలు ఉల్లంఘించినట్లు విచారణలో తేలడంతో మీ సేవ కేంద్రం, ఆధార్ పీఈసీ అనుమతులు రద్దు చేశారు.

సిర్పూర్ నియోజకవర్గానికి చెందిన ఒకరు నిజామాబాద్‌లో నివాసం ఉంటున్నారు. పోటీ పరీక్షల నిమిత్తం కులం ధ్రువీకరణ పత్రం కోసం స్థానికంగా ఉండే మీసేవ నిర్వాహకుడిని సంప్రదించాడు. రూ.500 పంపిస్తే సర్టిఫికెట్ అందిస్తానని చెప్పడంతో ఫోన్‌పే ద్వారా డబ్బులు పంపించాడు. అనంతరం మీసేవ కేంద్రంలో మీ సర్టిఫికెట్ కోసం రూ.45 సర్వీసు చార్జీ అయినట్లు ఫోన్‌కు సందేశం వచ్చింది. రూ.45 తీసుకోవాల్సిన మీసేవ కేంద్రం నిర్వాహకుడు రూ.500 వసూలు చేసినట్లు గుర్తించాడు.

- మీ సేవ కేంద్రాల్లో ఇష్టారాజ్యం
- రెవెన్యూ సిబ్బందితో నిర్వాహకుల కుమ్మక్కు!
- ధ్రువపత్రాలకు అధికంగా వసూళ్లు

కౌటాల(సిర్పూర్): సులభంగా.. వేగంగా అనే నినాదంతో ఆన్‌లైన్ ద్వారా ప్రభుత్వ సేవలు ప్రజలకు చేరువ చేసేందుకు మీ సేవ కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లాలోని రైతులు, నిరాక్షరాసుల అమాయకత్వాన్ని, నిరుద్యోగుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని దందాలకు తెరలేపారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న యువతతోపాటు విద్యార్థుల నుంచి నిర్ణీత ధరల కంటే అధికంగా వసూలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇటీవల జైనూర్‌లోని ఓ మీసేవ కేంద్రం అనుమతిని కలెక్టర్ రద్దు చేయడం చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం జనన, మరణ, కులం, ఆదాయం, నివాసం, భూములకు సంబంధించి మ్యుటేషన్లు, పాస్‌పుస్తకాలు, రిజిస్ట్రేషన్ పత్రాలు.. ఇలా ప్రతీ దాని కోసం 'మీ సేవ' గడప తొక్కాల్సిందే. దాదాపు 500 రకాల సేవలందిస్తున్నారు. జిల్లాలోని 15 మండలాల పరిధిలో 57 మీసేవ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో ఎక్కువగా రెవెన్యూ శాఖకు సంబంధించిన కార్యకలాపాలు సాగుతుండగా, ఆతర్వాత ధ్రువీకరణ అప్లికేషన్లు అధికంగా ఉంటున్నాయి. అధిక వసూళ్లను అరికట్టేందుకు రాష్ట్రప్రభుత్వం ఇటీవల క్యూర్ కోడ్ ద్వారా ఆన్‌లైన్ చెల్లింపుల విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది.

కొత్తవి అందుబాటులోకి వస్తేనే..

జిల్లాలో ప్రస్తుతం మీసేవ కేంద్రాలు పరిమిత సంఖ్యలో ఉండటంతో డిమాండ్ ఎక్కువగా ఉంది. దరఖాస్తుదారులకు మరో అవకాశం లేకపోవడంతో మీసేవ కేంద్రాల నిర్వాహకులు చెప్పిందే వేదంగా మారుతోంది. పనుల కోసం వెళ్లిన వారిని రోజుల తరబడి తిప్పించుకుంటున్నారు. ఏళ్ల తరబడి కేంద్రాలు నిర్వహిస్తున్న వారు సాధారణ ప్రజలతో చులకనగా మాట్లాడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ తరుణంలో కాంగ్రెస్ ప్రభుత్వం స్వయం సహాయక సంఘాల సభ్యులకు నూతన మీసేవ కేంద్రాలు కేటాయించిన విషయం తెలిసిందే. జిల్లాలో మొత్తం 335 గ్రామ పంచాయతీలు ఉండగా, మొదటి విడతలో 78 జీపీల్లో మీసేవ కేంద్రాల ఏర్పాటుకు నాలుగు నెలల క్రితం అనుమతినిచ్చింది. అర్హులైన మహిళా సంఘాల సభ్యుల నుంచి మండలస్థాయి అధికారులు దరఖాస్తులు సైతం స్వీకరించారు. గత ఆగస్టు 15 నుంచి మీసేవ కేంద్రాలు ప్రారంభిస్తామని ప్రకటించినా ఇప్పటివరకు అందుబాటులోకి రాలేదు. దరఖాస్తు చేసుకున్న మహిళలు కూడా ఉపాధి దొరుకుతుందనే ఆశతో ఉన్నారు. కొత్తవి అందుబాటులోకి వస్తే మీసేవ కేంద్రాల్లో దోపిడీ తగ్గుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

అధిక వసూళ్లు..

ఆదాయం, కులం, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు తీసుకోవడం జిల్లావాసులకు తలకు మించిన భారంగా మారింది. కొన్ని మండలాల్లో రెవెన్యూ అధికారులు ధ్రువపత్రాల కోసం ఇద్దరు గెజిటెడ్ అధికారులు, మరో ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగుల అటెస్టేషన్, రూ.20 బాండ్‌పై నోటరీ లాయర్ హామీ పత్రం తప్పనిసరి అంటూ అడ్డగోలు నిబంధనలతో విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. తీరా మీసేవ కేంద్రాల వద్దకు వెళ్తే అక్కడ నిర్వాహకులు అధిక వసూళ్లతో మరింత ఇబ్బంది పెడుతున్నారు. అడిగినంత ఇవ్వకుంటే రోజుల తరబడి పెండింగ్‌లో పెడుతున్నారు. రూ.45 సర్వీసు చార్జీ ఉండే సర్టిఫికెట్లకు కూడా రూ.500 నుంచి రూ.1000 వరకు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి ఆ పత్రాలను తహసీల్దార్ కార్యాలయానికి పంపించి, తామే ఆమోదించేలా చూస్తామని చెబుతూ అమాయకులను నమ్మిస్తున్నారు.

ఫిర్యాదులు వస్తున్నాయి

మీసేవ కేంద్రాల్లో దోపిడీకి చెక్ పెట్టేందుకు ప్రభుత్వం క్యూఆర్ కోడ్ చెల్లింపులను అందుబాటులోకి తీసుకువచ్చింది. అయినా కొందరు నిర్వాహకులు సేవలకు అధికంగా వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయి. ఇటీవల అధిక వసూళ్లకు పాల్పడిన జైనూర్‌లోని మీసేవ కేంద్రం అనుమతిని కలెక్టర్ రద్దు చేశారు. నిబంధనలు పాటించని మీ సేవ కేంద్రాలపై చర్యలు తప్పవు.

– గౌతమ్‌రాజ్, ఈ– డిస్ట్రిక్ట్ మేనేజర్

కుటుంబ సర్వే వేగంగా పూర్తిచేయాలి

- డీపీవో భిక్షపతి

రెబ్బెన(ఆసిఫాబాద్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే త్వరితగతిన పూర్తిచేయాలని జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి అన్నారు. మండలంలోని నారాయణపూర్‌లో సమగ్ర కుటుంబ సర్వేను గురువారం తనిఖీ చేశారు. ఎన్యుమరేటర్లు నమోదు చేస్తున్న కుటుంబ సభ్యుల వివరాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన నిర్ణీత గడువులోగా సర్వే పూర్తిచేయాలన్నారు. బ్లాకుల వారీగా గుర్తించిన ఇళ్లకు వెళ్లి సమాచారం సేకరించాలని సూచించారు. వివరాల నమోదులో ఎలాంటి తప్పులు దొర్లకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, ఎన్యుమరేటర్లు సమన్వయంతో పనిచేసి వందశాతం సర్వే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.



నారాయణపూర్‌లో సర్వే వివరాలు పరిశీలిస్తున్న డీపీవో భిక్షపతి

కౌలు రైతులను గుర్తించాలని వినతి

ఆసిఫాబాద్: కౌలు రైతులను గుర్తించి ఎల్‌ఈసీ కార్డులు జారీ చేయాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న గురువారం జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ కౌలు రైతులు పంట అమ్ముకునేలా రైతు భరోసా కార్డులు జారీ చేయాలన్నారు. ఈ విషయమై అసెంబ్లీ శీతాకాల సమావేశంలో లేవనెత్తాలని ఎమ్మెల్యేను కోరారు. జిల్లాలో 1.17 లక్షల మంది కౌలు రైతులు ఉన్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో రైతు భరోసా నిధులిస్తామని హామీ ఇచ్చి విస్మరించిందని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు, రైతులు మాణిక్‌రావు, దుందేరావు, యశ్వంత్, మహేశ్ ఉన్నారు.



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

గురుకుల విద్యార్థుల ప్రతిభ

సిర్పూర్(టి): పదో జోనల్‌స్థాయి క్రీడా పోటీల్లో సిర్పూర్(టి) సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల/కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపి ఓవరాల్ చాంపియన్‌గా నిలిచారు. ప్రతిభ చూపిన క్రీడాకారులను గురువారం గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్, డీసీవో శ్రీనివాస్, ఉపాధ్యాయులు అభినందించారు. ములుగు జిల్లాలో ఈ నెల 11 నుంచి 14 వరకు నిర్వహించిన పదో జోనల్‌స్థాయి క్రీడాపోటీల్లో అండర్- 14 విభాగం కబడ్డీలో ద్వితీయ బహుమతి, అండర్- 17 బాల్‌బ్యాడ్మింటన్‌లో ప్రథమ బహుమతి, అండర్- 17 ఫుట్‌బాల్‌లో ద్వితీయ బహుమతి, అండర్- 19 టెన్నికాయిట్‌లో ద్వితీయ బహుమతి, అలాగే అథ్లెటిక్స్ విభాగంలో అండర్-14 డిస్కస్ త్రోలో ప్రథమ బహుమతి, అండర్-17 విభాగం 100 మీటర్స్‌లో ప్రథమ, తృతీయ బహుమతి, 200మీ.లో ప్రథమ, ద్వితీయ బహుమతులు, 400మీ.లో ప్రథమ బహుమతి, 5000 మీ.లో తృతీయ బహుమతి, లాంగ్‌జంప్‌లో ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించినట్లు తెలిపారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు

బాలికల సత్తా

మంచిర్యాల జిల్లాలో ఈ నెల 11 నుంచి 14 వరకు నిర్వహించిన పదో జోనల్ స్థాయి క్రీడా పోటీల్లో సిర్పూర్(టి) సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల/కళాశాల విద్యార్థినులు కూడా సత్తా చాటారు. అండర్- 14 రన్నింగ్ 100, 200 మీటర్లలో ప్రథమ బహుమతి, టెన్నికాయిట్, ఖోఖో, క్యారం బోర్డు పోటీల్లో ద్వితీయ బహుమతి, అండర్- 17 విభాగం డిస్కస్ త్రోలో ప్రథమ బహుమతి, లాంగ్‌జంప్, బాల్ బ్యాడ్మింటన్‌లో ద్వితీయ బహుమతి, 100, 200 మీ. షాట్‌పుట్‌లో తృతీయ బహుమతి, అండర్ – 19 టెన్నికాయిట్, ఖోఖోలో ప్రథమ బహుమతి, చెస్‌లో ద్వితీయ బహుమతి, అథ్లెటిక్స్‌లో అండర్- 17, 19లో చాంపియన్ షిప్ కైవసం చేసుకున్నారని ప్రిన్సిపాల్ శారద తెలిపారు.

కొనసాగుతున్న 'సమగ్ర' సర్వే

- ఇప్పటివరకు 1,41,132 నివాస గృహాల సర్వే
- జిల్లాలో 88శాతం పూర్తి
- గ్రామీణ ప్రాంతాల్లో నిదానంగా ప్రక్రియ
- పనుల వేళ ఇబ్బందిపడుతున్న ఎన్యుమరేటర్లు

పెంచికల్‌పేట్(సిర్పూర్): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, కులగణన సర్వే జిల్లాలో కొనసాగుతోంది. ఆయా బ్లాకుల్లో నియమించిన ఎన్యుమరేటర్లు ఉదయం పాఠశాలకు హాజరవుతూ మధ్యాహ్నం నుంచి సర్వేలో భాగంగా యజమానుల నుంచి వివరాలు సేకరిస్తున్నారు. జిల్లాలోని 1131 మంది ఎన్యుమరేటర్లు ఇప్పటివరకు గ్రామీణ ప్రాంతాల్లో 1,24,007 నివాస గృహాలను సర్వే చేయగా.. పట్టణ ప్రాంతాల్లో 17,125 నివాస గృహాలను సర్వే చేశారు. మొత్తం 1,41,132 గృహాల నుంచి వివరాలు సేకరించినట్లు అధికారులు తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు అత్యధికంగా దహెగాంలో 95శాతం, అత్యల్పంగా బెజ్జూర్‌లో 77 సర్వే పూర్తయింది. సరాసరి జిల్లాలో 88శాతం సర్వే పూర్తి అయినట్లు అధికారులు చెబుతున్నారు.



పెంచికల్‌పేట్‌లో సర్వే పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి(ఫైల్)

మున్సిపాలిటీల్లో ఇలా..

కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో 20,285 నివాస గృహాలు ఉండగా గురువారం వరకు 17,125 నివాస గృహాల సర్వే పూర్తిచేశారు. అలాగే ఆసిఫాబాద్ మున్సిపాలిటీలో అత్యల్పంగా 5,420 నివాస గృహాలు ఉండగా 3,819 నివాస గృహాల సర్వే మాత్రమే పూర్తయింది. అధికారులు విధించిన గడువు శుక్రవారం నాటికి ముగుస్తున్న నేపథ్యంలో మరో రెండు రోజుల సమయం కేటాయించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

ఎన్యుమరేటర్లకు ఇబ్బందులు

గ్రామీణ ప్రాంతాల్లో సర్వేచేస్తున్న ఎన్యుమరేటర్లకు తిప్పలు తప్పడం లేదు. ఉదయం పూట 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. అనంతరం సర్వే కోసం కేటాయించిన గ్రామాలకు సర్వే కోసం పరుగులు తీస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రస్తుతం వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇంటి వద్ద వృద్ధులు, చిన్న పిల్లలు మాత్రమే అందుబాటులో ఉంటున్నారు. సమాచారం సేకరించడంలో ఎన్యుమరేటర్లు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. సాయంత్రం వరకు కేవలం 6 నుంచి 8 గృహాల సమాచారం మాత్రమే సేకరిస్తున్నారు. పాఠశాలలో పనిచేసేచోట కాకుండా వేరే ప్రాంతాల్లో సర్వే విధులు కేటాయించడంతో సమయం వృథా అవుతోంది. కుటుంబ యజమానుల నుంచి 75 రకాల ప్రశ్నలకు సమాచారం సేకరిస్తున్నారు. సర్వే కోసం వెళ్లిన సమయంలో ఒక్కొక్కరి వద్ద సమాచారం, వివరాలు లేకపోవడంతో అదనంగా సమయం కేటాయించాల్సి వస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో సర్వే నెమ్మదిగా సాగుతుండగా.. పట్టణ ప్రాంతాల్లో వేగంగా సాగుతోంది.

కుటుంబాలు రెండింతలు

- సమగ్ర సర్వేలో పెరిగిన గృహాల సంఖ్య
- 2011 లెక్కల ప్రకారం కెరమెరి మండలంలో 6,601 గృహాలు
- ప్రస్తుతం 10,200 వరకు ఉన్నట్లు అంచనా

కెరమెరి(ఆసిఫాబాద్): సమగ్ర కుటుంబ సర్వేలో కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం కెరమెరి మండలంలో 12 గ్రామ పంచాయతీలు ఉండగా 6,601 గృహాలు ఉన్నాయని గుర్తించారు. 28 వేల జనాభా ఉంది. ఈ నెల 6 నుంచి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో గురువారం వరకు 10,200 కుటుంబాలు ఉన్నట్లు గుర్తించారు. ఈ లెక్కన మండల జనాభా కూడా 40 వేలకు పైగా దాటవచ్చని తెలుస్తోంది. అయితే ఒక్క కెరమెరి గ్రామ పంచాయతీలోనే 1,672 కుటుంబాలు ఉన్నట్లు గుర్తించారు. గ్రామ పంచాయతీల సంఖ్య కూడా 31కి పెరిగింది. జిల్లాలోనే అత్యధిక గ్రామ పంచాయతీలు కలిగిన మండలం కెరమెరి కావడం విశేషం. ఉమ్మడి కుటుంబాల్లో పది మందికి పైగా ఉండటంతో ఎన్యుమరేటర్లు ఆశ్చర్యపోతున్నారు. అంతేకాక ఒకే ఇంట్లో రెండు, మూడు కుటుంబాలు ఉంటున్నాయని తెలుస్తోంది.



కెరమెరి మండల కేంద్రం

90 శాతం సర్వే పూర్తి..

కుటుంబాలు అధికంగా ఉండటం, కొందరు ఇళ్ల వద్ద ఉండకపోవడంతో వివరాల సేకరణ ఆలస్యమవుతోంది. కెరమెరి మండలంలో 31 పంచాయతీలు ఉండగా 119 ఎన్యుమరేటర్లు వివరాలు సేకరిస్తున్నారు. 10 మంది సూపర్‌వైజర్లు, ముగ్గురు మండలాధికారులు ఉన్నారు. వీరిలో 68 మంది ఉపాధ్యాయులే ఉండటంతో ఉదయం పాఠశాలల్లో విధులకు హాజరై, మధ్యాహ్నం నుంచి సర్వే చేస్తున్నారు. గురువారం నాటికి 90 శాతం సర్వే పూర్తయిందని ఎంపీడీవో అంజద్‌పాషా తెలిపారు. 9185 కుటుంబాల వివరాలు సేకరించామని, రెండు రోజుల్లో సర్వే పూర్తిచేస్తామని పేర్కొన్నారు. గత వివరాలతో పోలిస్తే ప్రస్తుతం కుటుంబాల సంఖ్య పెరిగిందని ఆయన స్పష్టం చేశారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

నర్సాపూర్(జి): మండలంలోని రాంపూర్ గ్రామం 61వ జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. మండలంలోని నందన్ గ్రామానికి చెందిన కూన స్వామి తన పనులు ముగించుకుని టీవీఎస్ ఎక్సెల్‌పై ఇంటికి వెళ్తుండగా నిర్మల్ నుంచి భైంసా వెళ్తున్న కదం దీపక్ ద్విచక్ర వాహనంపై వచ్చి వెనుక నుంచి ఢీ కొట్టాడు. ఈ ఘటనలో దీపక్‌కు తీవ్రంగా స్వామికి స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు దీపక్‌ను నిర్మల్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి, స్వామిని నర్సాపూర్ (జి) ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై హన్మాండ్లు తెలిపారు.

బైక్ అదుపుతప్పి ఒకరికి ..

భీమారం(చెన్నూర్): మండల కేంద్రంలోని ఆరెపల్లి క్రాస్ రోడ్డు వద్ద జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గోదావరిఖనికి చెందిన జక్కుల ఐలయ్య, గాదె పోశం గొర్రెలు కొనుగోలు చేసేందుకు ద్విచక్ర వాహనంపై చెన్నూర్ వెళ్తుండగా అడ్డువచ్చిన కుక్కలను తప్పించే క్రమంలో బైక్ అదుపుతప్పి కిందపడిపోయారు. దీంతో ఐలయ్యకు తీవ్రంగా పోశంకు స్వల్ప గాయాలయ్యాయి. 108కు సమాచారం అందించడంతో క్షతగాత్రులను చికిత్స నిమిత్తం మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు.

కలప స్మగ్లర్ బైండోవర్

భీమారం(చెన్నూర్): మండలంలోని బూర్గుపల్లి గ్రామానికి చెందిన కలప స్మగ్లర్ సపోట తులసీరాంను గురువారం తహసీల్దార్ సదానందం ఎదుట బైండోవర్ చేసినట్లు మంచిర్యాల అటవీశాఖ రేంజ్ ఆఫీసర్ రత్నాకర్ రావు తెలిపారు. తులసీరాం పలుమార్లు కలప రవాణా చేస్తూ పట్టుబడ్డాడని, మరోసారి కలప రవాణా చేయకుండా చర్యలు చేపట్టినట్లు రేంజ్ ఆఫీసర్ తెలిపారు. కాగా వచ్చే ఆరునెలల కాలంలో మళ్లీ నేరం చేస్తే రూ.5 లక్షల జరిమానా చెల్లించాలని తహసీల్దార్ ఆదేశించారని, ఈమేరకు పూచికత్తుపై విడుదల చేసినట్లు పేర్కొన్నారు.

ముగ్గురి రిమాండ్

మందమర్రిరూరల్: మందమర్రి మండలం సారంగపల్లి గ్రామ పంచాయతీ శివారులోని దుబ్బపల్లి అటవీ ప్రాంతంలో ఈనెల 16న వన్యప్రాణుల వేటకోసం అమర్చిన విద్యుత్ తీగలకు తగిలి రెండు గేదెల మృతికి కారకులైన ముగ్గురికి గురువారం జిల్లా కోర్టు 14 రోజులు రిమాండ్ విధించినట్లు డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సంతోష్ తెలిపారు. సండ్రోన్‌పల్లికి చెందిన గోస్కుల సతీష్, గోస్కుల రాజు, దైనేని లచ్చులును ఫారెస్ట్ అధికారులు అదుపులోకి తీసుకుని విచారించగా నేరం చేసినట్లు ఒప్పుకున్నారు. ఇదిలా ఉండగా సారంగపల్లికి చెందిన మరో ఇద్దరు కూడా ఈ కేసులో ఉన్నట్లు సమాచారం.

మహిళ అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని గడియార్ మహోళకు చెందిన సంగెంవార్ శోభబాయి (29)బుధవారం అదృశ్యమైందని టూ టౌన్ హెడ్‌కానిస్టేబుల్ మదన్ తెలిపారు. ఇంటి వద్ద గొడవ జరుగడంతో పట్టణంలోని ఇంద్రానగర్‌లో నివాసముంటున్న తన మేనమామ వద్దకు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరిన ఆమె అక్కడికి వెళ్లలేదు. దీంతో మహిళ తమ్ముడు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.



ఐజీకి గౌరవ వందనం చేస్తున్న శిక్షణ పూర్తి చేసిన కానిస్టేబుళ్లు



కార్యక్రమానికి హాజరైన పోలీసు కానిస్టేబుళ్ల కుటుంబసభ్యులు

విధుల్లో క్రమశిక్షణ ముఖ్యం

- తెలంగాణ రాష్ట్ర ఐజీ ఎం.రమేశ్
- ఘనంగా దీక్షాంత్ పరేడ్
- శిక్షణ పూర్తి చేసుకున్న 254 మంది కానిస్టేబుళ్లు



ఉత్తమ ప్రతిభ కనబర్చిన పోలీసు కానిస్టేబుళ్లతో ఐజీ రమేశ్, కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌస్ ఆలం

ఆదిలాబాద్‌టౌన్: పోలీసు విధుల్లో క్రమశిక్షణ ముఖ్యమని, చట్టాన్ని ఉల్లంఘించకుండా రాజ్యాంగ ధర్మాన్ని పాటిస్తూ విధులు నిర్వర్తించాలని తెలంగాణ రాష్ట్ర పీఅండ్‌ఎల్ ఐజీ ఎం.రమేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీసు శిక్షణ కేంద్రంలో తొమ్మిది నెలల పాటు శిక్షణ పూర్తి చేసుకున్న 254 మంది నూతన కానిస్టేబుళ్లకు గురువారం 'దీక్షాంత్ పరేడ్' నిర్వహించారు. కార్యక్రమానికి ఐజీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. శిక్షణలో ఉత్తమ ప్రతిభ సాధించిన ఐదుగురికి కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ గౌస్ ఆలం, 2వ బెటాలియన్ కమాండెంట్ నితిక పంత్‌లతో కలిసి ఇండోర్, అవుట్‌డోర్, బెస్ట్ ఆల్‌రౌండర్, పరేడ్ కమాండర్ విభాగాల్లో బహుమతులు అందజేశారు. శిక్షణ అందించిన 50 మంది పోలీసు, వైద్య సిబ్బంది, న్యాయాధికారులకు ప్రశంసపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీతి నిజాయతీతో విధులు చేపట్టాలని సూచించారు. పోలీసు సేవలో ప్రతిఒక్కరూ అంతర్భాగమేనని, వ్యవస్థలో విజయం సాధించాలంటే కుటుంబ సభ్యుల సహకారం ఎంతో అవసరమన్నారు. కఠోర శ్రమతో శిక్షణ పూర్తి చేసుకున్న 254 స్టైఫండరి ట్రెయినీ సివిల్ కానిస్టేబుళ్లలో రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి 35 మంది, సూర్యాపేట నుంచి 129, జగిత్యాల నుంచి 34, ములుగు నుంచి 16, సంగారెడ్డి నుంచి 15, సైబరాబాద్ నుంచి 25 మంది ఉన్నారన్నారు. శిక్షణలో వినాయక నవరాత్రులు, జైనూర్ సంఘటన, దేవీ నవరాత్రి ఉత్సవాల బందోబస్తు నిర్వహించి అనుభవం సాధించారన్నారు. త్రివర్ణ పతాక సాక్షిగా చేసిన ప్రమాణాన్ని, మీ జిల్లాల్లో విధులు నిర్వర్తిస్తున్న సమయంలో గుర్తు చేసుకోవాలన్నారు. అధికారులు నిర్దేశించిన విధులు నిష్పక్షపాతంగా, ఎలాంటి రాగద్వేషాలు లేకుండా సమన్యాయంతో నిర్వర్తించాలని సూచించారు. అవినీతి ఆరోపణలు లేకుండా ప్రలోభాలకు గురికాకుండా నిజాయతీతో విధులు నిర్వర్తించాలని సూచించా కానిస్టేబుళ్లకు శిక్షణలో భాగంగా పోలీసు పరిపాలన డాక్యుమెంటేషన్, వ్యక్తిత్వ వికాసం, శాంతిభద్రతలు, ఇంటెలిజెన్స్, అంతర్గత భద్రత, క్రిమినల్ చట్టం బీఎంఎస్, బీఎస్ఎస్ఎస్, ఫోర్‌ఇన్‌సిక్స్ సైన్స్, ఫోరెన్సిక్ మెడిసిన్, అవుట్‌డోర్ విభాగాల్లో ఫిజికల్ ట్రైనింగ్, స్క్వాడ్రిల్, ఆమ్స్ డ్రిల్, లాటిడ్రిల్, టియర్ గ్యాస్, మాబ్ ఆపరేషన్, వెపన్ ట్రైనింగ్ ఫీల్డ్ క్రాఫ్ట్, ట్రాఫిక్ డ్రిల్, ఫస్ట్‌ఎయిడ్ లాంటి వాటిలో శిక్షణను అందించినట్లు శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్ అదనపు ఎస్పీ సి.సమయ్ జాన్‌రావు తెలిపారు. అంతకుముందు ఐజీ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శిక్షణ ఐఏఎస్ అభిజ్ఞన్, అదనపు ఎస్పీ ఆపరేషన్ బి.సురేందర్‌రావు, డీఎస్పీలు ఎల్.జీవన్ రెడ్డి, బి.సురేందర్‌రెడ్డి, ప్రకాష్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, రిజర్వు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మొదటి శిక్షణ జిల్లాలోనే : ఐజీ రమేశ్

హైదరాబాద్‌లో తొమ్మిది నెలల పాటు డీఎస్పీగా శిక్షణ పొందిన తర్వాత ఆదిలాబాద్ వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో నెల రోజుల పాటు పోలీస్ కానిస్టేబుల్‌కు సంబంధించి వన్‌టౌన్‌లో పనిచేసిన కానిస్టేబుల్ బాబర్ వద్ద శిక్షణ తీసుకున్నట్లు చెప్పారు. సెంట్రిడ్యూటీ, దర్యాప్తు నేర్చుకున్నట్లు తెలిపారు. ఆ సమయంలో ఎస్‌హెచ్‌ఓగా సురేందర్ రెడ్డి ఉన్నారని పేర్కొన్నారు. తాను ఆ సమయంలో నేర్చుకున్న శిక్షణ ఎంతగానో ఉపయోగపడిందన్నారు. ఈ సందర్భంగా జిల్లాతో ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు. తనకు శిక్షణ ఇచ్చిన కానిస్టేబుల్, ఆ సమయంలో పనిచేసిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్లను గుర్తు చేసుకున్నారు.



కానిస్టేబుళ్ల ఫొటోలు తీసుకుంటున్న కుటుంబసభ్యులు

ఆనందక్షణం... అద్వితీయం

తెలంగాణలోని ఆరు జిల్లాలకు చెందిన పోలీసు కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్ గురువారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో అట్టహాసంగా జరిగింది. అవుట్ పరేడ్‌ను తిలకించేందుకు తమ కుటుంబసభ్యులు హాజరు కాగా కొంతమంది కానిస్టేబుళ్లు వారితో తమ జ్ఞాపకాన్ని పదిలపర్చుకున్నారు. ఆ మధుర క్షణాలను సెల్‌ఫోన్‌లో బంధించారు. డీటీసీలో కన్పించిన ఈ దృశ్యాలు ఆకట్టుకున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్



కూతురుకు పోలీసు క్యాపు ధరిస్తూ..



తల్లిదండ్రులకు సెల్యూట్ చేస్తున్న కుమారుడు

వ్యాను ఢీకొని వృద్ధుడు మృతి



మృతదేహానికి పంచనామా నిర్వహిస్తున్న ఎస్సై

రెబ్బెన(ఆసిఫాబాద్): ఐచర్ వ్యాను ఢీకొని వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం కైరిగాం గ్రామానికి చెందిన ఎర్ర లచ్చయ్య (68) బుధవారం రాత్రి జాతీయ రహదారి అవతలి వైపు ఉన్న కిరాణా దుకాణానికి వెళ్లి ఇంటికి వచ్చేందుకు రోడ్డు దాటుతుండగా ఆసిఫాబాద్ వైపు నుంచి వస్తున్న ఐచర్ వ్యాను అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో వృద్ధునికి తీవ్రగాయాలు కావడంతో గమనించని స్థానికులు చికిత్స నిమిత్తం ఆసిఫాబాద్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు వ్యాన్ డ్రైవర్ మల్లేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆయుధాలతో నలుగురి పట్టివేత..?

- ఆదిలాబాద్–మహారాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద..!
- ఉత్తరప్రదేశ్‌కు చెందిన సాధువులు అనే ప్రచారం
- నల్గొండ పోలీసుల అదుపులో..
- నేరుగా వారిని హైదరాబాద్‌కు తరలించారనే వినికిడి
- వివరాల వెల్లడిలో పోలీసుల గోప్యత

సాక్షి,ఆదిలాబాద్: షార్ట్ వెపన్స్ కలిగి ఉన్న నలుగురు వ్యక్తులను తెలంగాణ పోలీసులు ఆదిలాబాద్–మహారాష్ట్ర సరిహద్దులో భోరజ్ చెక్‌పోస్టు వద్ద పట్టుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. వారు ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సాధువులు అనే ప్రచారం జరుగుతోంది. నల్గొండ నుంచి వచ్చిన పోలీసులు ఆదిలాబాద్ జిల్లా పోలీసుల సహకారంతో వారిని అదుపులోకి తీసుకొని నేరుగా హైదరాబాద్‌కు తరలించినట్లు తెలుస్తోంది. ఈ విషయంలో పోలీసులు గోప్యత పాటిస్తున్నారు. ఎలాంటి వివరాలు వెల్లడించలేదు. ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ గౌస్ ఆలం, డీఎస్పీ జీవన్‌రెడ్డిని ఈ విషయంలో సంప్రదించేందుకు 'సాక్షి' ఫోన్‌లో యత్నించగా వారు అందుబాటులోకి రాలేదు. ఆ నలుగురు పేర్లు, వివరాలు పూర్తిస్థాయిలో తెలియరాలేదు. నల్గొండ పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు గురువారం ఆదిలాబాద్‌కు వారు నేరుగా చేరుకున్నట్లు తెలుస్తోంది. ఆదిలాబాద్ జిల్లాలోని జైనథ్ మండలంలో జాతీయ రహదారి 44 పైనే భోరజ్ చెక్‌పోస్టు ఉంటుంది. ఆ నలుగురు ఆయుధాలతో ఉండగా, వారిని పట్టుకొని జిల్లా పోలీసుల సహకారంతో రాష్ట్ర రాజధానికి తరలించారని జరుగుతున్న ప్రచారం సంచలనం కలిగి స్తోంది. ఇదిలా ఉంటే మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన తర్వాత ఈ సంఘటన సరిహద్దులో చోటు చేసుకోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఆ నలుగురు ఎటు నుంచి ఎటువైపు వెళ్తున్నారు? వారు ఎందుకోసం ఈ మార్గం గుండా బయల్దేరారు? వారి లక్ష్యం ఏమిటనే విషయాలు తెలియరాలేదు. అయితే ఆయుధాలు కలిగి ఉన్నారనడం మాత్రం ప్రకంపనలు సృష్టిస్తోంది.

హ్యుందాయ్ షోరూం ప్రారంభం



ప్రకాష్ హ్యుందాయ్ షోరూం ప్రారంభిస్తున్న రీజినల్ మేనేజర్ రాంకుమార్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణ సమీపంలో గురువారం ప్రకాష్ హ్యుందాయ్ నూతన షోరూమ్‌ను రీజినల్ మేనేజర్ రాంకుమార్, షోరూమ్ ఎండీ నల్ల దినేష్‌రెడ్డి, సీఈవో ప్రతిహాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు సేల్స్, సర్వీస్, స్పేర్‌లో అత్యాధునిక సదుపాయాలతో షోరూమ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌వో మేనేజర్ రోహిత్ కుమార్, టీఎస్ఎం స్నేహమై, సర్వీస్ టీఎస్ఎం ప్రకాష్, షోరూమ్ మేనేజర్ ఉమాకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తాపడి మహిళ మృతి

ఆదిలాబాద్‌రూరల్: ఆటో బోల్తాపడి మహిళ మృతి చెందిన సంఘటన ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఆదిలాబాద్ పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన మున్నిబీ (53), భర్త ఫారుఖ్ అహ్మద్ పాత బట్టలను విక్రయించే వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. గురువారం ఆటోలో పాత బట్టలను నింపుకొని ఆదిలాబాద్ నుంచి మహారాష్ట్రకు వెళ్తుండగా చాందా గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై బోల్తా పడింది. ఈ ఘటనలో మున్నిబీ అక్కడికక్కడే మృతి చెందగా ఫారుఖ్ అహ్మద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఓవర్ లోడ్, అతివేగం కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'స్ఫూర్తి'ని చాటి... ఉద్యోగం సాధించి



యెర్ర స్ఫూర్తి

నిర్మల్‌ఖిల్లా: నిర్మల్ జిల్లా కేంద్రంలోని దత్తాత్రేయ నగర్ కాలనీకి చెందిన యెర్ర వనజ–పాండురంగారెడ్డి దంపతుల కుమార్తె స్ఫూర్తి గురువారం సాయంత్రం విడుదలైన జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో ప్రతిభను కనబర్చి ఉద్యోగం సాధించింది. పదోతరగతి వరకు స్థానికంగా ఉన్న గౌతం మోడల్ స్కూల్, ఇంటర్ అభ్యాస జూనియర్ కళాశాలలో, డిగ్రీ హైదరాబాద్‌లోని కోఠి ఉమెన్స్ కాలేజీలో, పీజీ ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లో చదివింది.ఈ క్రమంలోనే తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నుండి జూనియర్ లెక్చరర్స్ నోటిఫికేషన్ విడుదల కాగా పట్టుదలతో చదివి రాష్ట్రస్థాయిలో 56వ ర్యాంకు, మల్టీజోన్ స్థాయిలో 30వ స్థానాన్ని సాధించి జూనియర్ లెక్చరర్ ఉద్యోగం సొంతం చేసుకుంది.

రేపు ఉమ్మడి జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో శుక్రవారం జరగనున్న ఉమ్మడి జిల్లాస్థాయి అండర్–17 బాలుర క్రికెట్ ఎంపిక పోటీలను 23న నిర్వహించనున్నట్లు ఎస్జీఎఫ్ సెక్రెటరీ కాంతారావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం సబ్ జూనియర్స్ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్న దృష్ట్యా ఎంపిక పోటీలను 23కు వాయిదా వేయడం జరిగిందని, ఈ విషయాన్ని క్రీడాకారులు, శిక్షకులు గమనించాలని ఆయన కోరారు.

ఏఐటీయూసీలో పలువురి చేరిక

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని జీఎం ఆఫీస్‌లో విధులు నిర్వహిస్తున్న ఐఎన్టీయూసీ నాయకుడు సీవీ రమణతో పాటు మరి కొందరు గురువారం ఏఐటీయూసీలో చేరారు. జీఎం ఆఫీస్ ఆవరణలో యూనియన్ నాయకులు ఏర్పాటు చేసిన సమావేశానికి ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్, అధ్యక్షుడు సీతారామయ్య హాజరయ్యారు. వారి సమక్షంలో సీవీ రమణతో పాటు మరికొంతమంది యూనియన్‌లో చేరారు. సమావేశంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు సుదర్శన్, మల్లేశ్, శ్రీనివాస్, లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

'మామిడి'లో యాజమాన్య పద్ధతులు

- పూతదశలో ఆశిస్తున్న చీడపీడలు
- నివారణకు సస్యరక్షణ చర్యలు



కోట శివకృష్ణ, కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్



మామిడి తోట

బెల్లంపల్లి: మామిడిచెట్లకు పూత ఏపుగా రావడానికి యాజమాన్య పద్ధతులు పాటించాల్సిన సమయం ఆసన్నమైంది. పూత రావడానికి వాతావరణ పరిస్థితులు ఎంతగానో ప్రభావం చూపుతాయి. చెట్లకు పూత పూయించడానికి, వచ్చిన పూత ఆగడానికి, కాపు సరిగా రావడానికి, పూత దశలో ఆశించే చీడపీడల నివారణకు యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా పూత సరిగా రాక, అరకొరగా వచ్చిన పూత నిలువక దిగుబడి తగ్గుతుందని బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ప్రోగ్రాం కోఆర్డినేటర్, శాస్త్రవేత్త కోట శివకృష్ణ పేర్కొంటున్నారు. ఈక్రమంలో మామిడి రైతులు చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు, పాటించాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు.

చెట్లకు పూత వచ్చే దశ

మామిడి చెట్లకు సాధారణంగా జూలై, ఆగస్టు మాసాల్లో ఇగుర్లు వచ్చి ముదురుతాయి. ఇగుర్ల రెమ్మల్లో నుంచి పూత వస్తుంది. ఆ ప్రక్రియ డిసెంబర్ చివరి వారం నుంచి జనవరి వరకు జరుగుతుంది. డిసెంబర్‌లో సగటు ఉష్ణోగ్రత 18 నుంచి 28 డిగ్రీల సెంటిగ్రేడ్, రాత్రి ఉష్ణోగ్రత 10 నుంచి 13 డిగ్రీల సెంటి గ్రేడ్ వరకు ఉంటే చెట్లకు పూత ఏపుగా వస్తుంది. ఒకవేళ వాతావరణ పరిస్థితుల్లో తేడా ఏర్పడితే పూతలో మార్పులు ఉంటాయి. అందుచేత పూత రావడానికి రెండు నెలలు తోటలకు నీటి తడులు ఇవ్వడం పూర్తిగా నిలిపి వేయాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

నవంబర్ నుంచి జనవరి వరకు కొమ్మ కత్తిరింపులు, దున్నడం లాంటివి చేయకుండా మామిడి చెట్లకు విశ్రాంతి ఇవ్వాలి. ఆ సమయంలో చెట్టుకు అంతరాయం కలిగిస్తే పూత రావడం ఆలస్యం కావడం లేదా పూత రాకుండా ఉండడమే కాకుండా దిగుబడులు తగ్గే అవకాశం ఉంటుంది. సాధారణంగా మామిడి చెట్లకు డిసెంబర్, జనవరిలో పూత ప్రారంభమై ఫిబ్రవరి వరకు పూస్తాయి. ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పుడు పూ మొగ్గలను ఉత్తేజ పరిచేందుకు డిసెంబర్ రెండవ పక్షంలో లీటరు నీటికి 10 గ్రాముల మల్టీ–కే (పొటాషియం,నైట్రేట్), 5 గ్రాముల యూరియా కలిపి చెట్ల పైరెమ్మలు బాగా తడిచేలా పిచికారీ చేయాలి. యూరియా, మల్టీ–కేలోని నత్రజని, పొటాషియం పోషకాలు కలిసి పూ మొగ్గలను ఉత్తేజ పరుస్తాయి. దీంతో చెట్లకు పూత అధికంగా రావడానికి, పిందె కట్టడానికి, కాయలు మంచి సైజులో నాణ్యతగా ఎదగడానికి సహకరిస్తాయి.

చీడపీడల నివారణకు యాజమాన్య పద్ధతులు

సాధారణంగా మామిడి చెట్లను పూత దశలో బూడిద రంగు తెగులు ఆశిస్తుంది. లేత ఆకులు, పూత కాండం, పూలమీద, చిరుపిందెల మీద, తెల్లని పౌడర్ లాంటి బూజు చేరుతుంది. దీనినే బూడిద తెగులు అంటారు. ఇది ఎక్కువగా రాత్రి పూట చల్లగా, పగలు వేడి ఎక్కువగా ఉన్నప్పుడు ఆశిస్తుంది. ఈ తెగులు వల్ల చెట్లకు వచ్చిన పూత, కాత రాలి పోతుంది. దీని నివారణకు పూత దశలో తెగులు కనిపించగానే హెక్సాకోనజోల్ 2.మి.లీ లేదా ప్రొపికోనజోల్ 1 మి.లీ లేదా డినోకాప్ లేదా ట్రైడిమాల్ఫ్ 1 మి.లీ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

పూత ఏపుగా రావడానికి ..

మామిడి చెట్లకు పూత ఏపుగా రావడానికి యాజమాన్య పద్ధతులు పాటించాలి. తోటల్లో తేనెటీగ పట్టులను ఏర్పాటు చేయడం వల్ల తేనెటీగల సంచారం పెరిగి పరపరాగ సంపర్కం అధికంగా జరుగుతుంది. దీంతో పూత ఏపుగా రావడానికి వీలవుతుంది. తద్వారా పంట దిగుబడి 20 నుంచి 30 శాతం పెరిగేందుకు ఆస్కారం ఉంటుంది. తోట నలుమూలల తేనెపట్టులను ఏర్పాటు చేసుకోవడం వల్ల ఉపయుక్తంగా ఉంటుంది.

ఆకుమచ్చ, నల్లమచ్చ తెగుళ్ల ప్రభావం

ఆకుమచ్చ, పూతమాడు, నల్లమచ్చ తెగుళ్లు పూత సమయంలో ఆశిస్తాయి. వర్షాలు, పొగమంచు అధికంగా ఉన్న సమయంలో ఈ తెగుళ్లు విజృంభిస్తాయి. లేత ఆకులు, రెమ్మలు, పూలను ఆశించి నష్టపరుస్తాయి. ఆకుల మీద గోధుమ రంగులో మచ్చలు ఏర్పడి ఆకులు త్వరగా పండుబారి రాలి పోతాయి. రెమ్మల పైన నల్లని మచ్చలు ఏర్పడి పూలగుత్తులు , పూలు మాడిపోతాయి. ఈ తెగులు నివారణ కోసం పూత దశకు ముందే ఎండిన కొమ్మలను కత్తిరించి తగుల బెట్టాలి. లీటరు నీటికి 3 గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్ లేదా 1 శాతం బోర్డో మిశ్రమం కలిపి పిచికారీ చేయాలి.

పట్టపగలే చోరీ

పెంబి: మండల కేంద్రానికి చెందిన పాకల రాజవ్వ రోజులాగే గురువారం ఉదయం పొలం పనులకు వెళ్లింది. సాయంత్రం ఇంటికి వచ్చేసరికి తలుపులు తెరిచి ఉన్నాయి. లోనికి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉంది. అందులో ఉన్న రెండు తులాల బంగారు ఆభరణాలు అపహరణకు గురైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు.

జేసీబీని ఢీకొట్టిన కారు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆర్కే 6 గాంధీనగర్ జాతీయ రహదారిపై గురువారం జేసీబీని కారు ఢీకొట్టింది. గోదావరిఖని ప్రాంతానికి చెందిన పలువురు కారులో బెల్లంపల్లికి వెళ్లి శ్రీరాంపూర్ వైపు వస్తుండగా ముందున్న జేసీబీని ఢీకొట్టారు. ప్రమాదంలో కారు ముందుభాగం ధ్వంసమైంది. కారులో ప్రయాణిస్తున్న నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి.

ట్రాక్టర్‌పై వెళ్లి.. వైద్యం అందించి



ట్రాక్టర్‌పై వెళ్తున్న వైద్య సిబ్బంది



చిన్నారిని పరీక్షిస్తున్న డాక్టర్

ఉట్నూర్‌రూరల్: మండలంలోని హీరాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని మారుమూల గ్రామమైన శాంతాపూర్‌కు సరైన రహదారి లేక అంబులెన్స్ వెళ్లలేని పరిస్థితి. గ్రామంలో 27 ఆదివాసీ కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. దంతన్‌పల్లి పీహెచ్‌సీ వైద్యురాలు అనురాధ గురువారం సిబ్బందితో కలిసి ట్రాక్టర్‌పై గ్రామానికి వెళ్లి వైద్యం అందించారు. ఈ సందర్భంగా 50 మందికి వైద్యచికిత్సలు అందించి మందులు పంపిణీ చేశారు. 10 మందికి రక్త పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఈవా ఫౌండేషన్ సభ్యులు కొమ్ము విజయ్ గ్రామస్తులకు పల్లిపట్టీలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఈ రాంబాయి, సూపర్‌వైజర్ నూర్‌సింగ్, ఏఎన్ఎంలు ఎల్లవ్వ, వరలక్ష్మి, స్వప్న, సిబ్బంది పాల్గొన్నారు.

SRKM College of B.Sc. Nursing
Vempally, Mancherial
మేనేజ్‌మెంట్ కోటాలో అడ్మిషన్లు జరుగుచున్నవి
అర్హత: NEET/ EAPCET/ INTER BiPC
చివరి తేది: 25-11-2024
హాస్టల్ సౌకర్యం కలదు
వివరాలకు సంప్ర: 8374585229, 9866231292, 9866509614

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES
BUSINESS OFFER
■ ప్రముఖ కంపెనీ అగ్రి, ప్రాపర్టీ, బిజినెస్ కొరకు ఏజెంట్స్ DMA, DSA కావలెను మంచి జీతం & కమీషన్. 7988242391 [SCA24000660]

WANTED
■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692 [M-1253922]
■ త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్లను చూసుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం, జీ : 18K. Ph: 9160900024, 9640400073 [SCA24000672]

www.sakshi.com

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888, 9010299065,
9951602823, 9010608462,